సంఘం అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

రామన్నపేట, జూలై14: మండలంలోని నీర్నెముల గ్రామంలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగుల సోమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చల్లా ఆనంద్, ప్రధానకార్యదర్శిగా నోముల యాదగిరి, కోశాధికారిగా సుర్వీ శ్రీనివాస్, సహాయకార్యదర్శిగా నాగటి స్వామి, గౌరవ సలహాదారులుగా తిరుగుడు మల్లికార్జున్, నోముల నర్సింహ, దొడ్డి స్వామి, నాగటి సోములు, సభ్యులుగా నవనీత, రమాశంకర్, భిక్షం, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, రవి, శోభ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో తోడ్పాటు అందిస్తానన్నారు. అనంతరం తమ పదవీకాలం పూర్తి చేసుకున్న వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, సర్పంచ్ ముత్యాల సుజాతారవి, ఉపసర్పంచ్ సల్ల అనితాసత్య ప్రకాశ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు.

పగుళ్లు పట్టిన కొలనుపాక ప్రాథమిక పాఠశాల గేట్ దిమ్మె

కూలేందుకు సిద్ధంగా పాఠశాల ప్రహరీ

ఆలేరురూరల్, జూలై14 : మండలం లోని కొలనుపాక మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల మెన్‌గేట్ పిల్లర్, గోడ పూర్తిగా పగుళ్లు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రతి రోజూ విద్యార్థులు వచ్చి పోయే సమయంలో అది కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలు ఆరు బయట ఆడుకునే సమయంలో గేటు వద్దకు వెళ్లి దానిని కదుపుతుంటారని, గోడ పిల్లలపై పడితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గోడకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గాంధీ చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

భువనగిరి కలెక్టరేట్, జూలై 14 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామ చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు చెడిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాంతో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ తన సొంత నిధులతో ఆదివారం కొత్త లైట్లను ఏర్పాటు చేయించారు. ప్రధాన చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు చెడిపోయి రాత్రి వేళల్లో చీకట్లో తాము ఇబ్బందులు పడ్డామని, శ్రీనివాస్ సొంత నిధులతో కొత్తవి ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హైమాస్ట్ లైట్లను రిపేర్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్ : బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిన్నేరు వాగుపై బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

భువనగిరి కలెక్టరేట్, జూలై 14 : మండలంలోని నందనం- సిరివేణికుంట గ్రామాల మధ్యగల చిన్నేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సిహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చిన్నేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం పనులు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, దాంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఏదునూరి మల్లేశం, ఎల్లెంల వెంకటేశం, జిట్ట అంజిరెడ్డి, కళ్లెం సుదర్శన్ రెడ్డి, సింగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కొల్లూరి సిద్ధి రాజు, మామిడి లచ్చిరెడ్డి, సిరివేణికుంట మాజీ సర్పంచ్ అనితావెంకటేశం పాల్గొన్నారు.

దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

రామన్నపేట : వర్షాలకు దెబ్బతిన్న బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇస్కిల్ల, వెల్లంకి గ్రామాల్లో వారు పర్యటించి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. వెల్లంకి గ్రామంలో ఇండ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను నిలిపి వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వనం ఉపేందర్, విజయ్‌భాస్కర్, మెడబోయిన శ్రీనివాస్, నగేశ్, మల్లయ్య, యాదయ్య, రాజలింగం, నరేశ్, నవీన్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 14 : పట్టణంలోని చేనేత డైహౌస్ భవనంలో శివ మెడికల్‌హాల్ ఆధ్వర్యంలో జీకే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వనస్థలిపురం వైద్యులతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, గైనకాలజీ డాక్టర్లు 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు గురు కృష్ణయాదవ్, దివ్యదేవి, రాధికారెడ్డి, సందీప్ కృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

సీత్లా పండుగ

కల్మెట్‌తండాలో శీత్లా పండుగను నిర్వహిస్తున్న గిరిజనులు

పాలకవీడు, జూలై 14 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని కల్మెట్ తండాలో గిరిజనులు సీత్లా పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీత్లా అమ్మవారికి నైవైద్యం సమర్పించడంతో పాటు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్, మేరమాయాడీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడుగుకో గుంత.. ప్రయాణమో చింత.!

- గుంతలమయంగా మారిన దుప్పల్లి ప్రధాన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గుంతల మయంగా మారిన దుప్పెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు

ఆత్మకూరు(ఎం),జూలై14 : తొర్రుర్–మోత్కూర్ ప్రధాన రహదారి నుంచి మండలంలోని దుప్పెల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. రోడ్డు పూర్తిగా కొట్టుకు పోయి కంకర తేలింది. దాంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై వెళ్లే వారు గుంతల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 3 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డుపై అడుగుకు ఒక గుంత ఏర్పడడంతో రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో మరీ ప్రమాదకరంగా మారింది.

4 కిలోమీటర్లు అదనపు ప్రయాణం

దుప్పెల్లి గ్రామస్తులు మోత్కూర్, వలిగొండకు వెళ్లేందుకు ఈ రోడ్డే ఆధారం. అయితే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించలేక గోపరాజ్‌పల్లి మీదుగా చిత్తాపురం, ముద్దాపురం నుంచి ప్రధానరోడ్డు వరకు ఏడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి వెళ్తున్నారు. దాంతో సమయం, ఆర్థికంగా భారం పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నరకయాతన పడుతున్నాం

ప్రధాన రహదారి నుంచి దుప్పల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతల మయంగా మారింది. ఈ రోడ్డు మీది నుంచి ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నాం. వాహన దారులు ప్రమాదాలకు గురయ్యారు. ఎన్నికల సమయంలో తాను గెలిస్తే నెల రోజుల్లోనే రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. కానీ నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైన ప్రభుత్వవిప్, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి.

–మణిమద్దె రాములు, దుప్పల్లి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చౌటుప్పల్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చౌటుప్పల్, జూలై 14 : చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ఎస్ఎంఆర్ ఫంక్షన్‌హాల్లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు వెంకటయ్య, ఆంజనేయులు, గిరిధర్ రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్లంకి ఉన్నత పాఠశాలలో..

రామన్నపేట : మండలంలోని వెల్లంకి ఉన్నత పాఠశాలకు చెందిన 1994-95 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తవుటం భిక్షపతి, ప్రభాకరశర్మ, కందికట్ల జానయ్య, యాదగిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు గంజి భాస్కర్, నాగులంచే నాగేశ్వర్‌రావు, జె.మురళి, మల్లేశం, మధు, నర్సింహ, కర్ణాకర్‌రెడ్డి, శ్రీశైలం, పద్మారెడ్డి, సతీశ్ సుదర్శన్, మాధవి, రాజ్యలక్ష్మి, సునంద, ఉమ, మల్లేశం పాల్గొన్నారు.

రామన్నపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రజక సంఘం పట్టణ అధ్యక్షుడిగా నర్సింహ

భూదాన్‌పోచంపల్లి, జూలై 14 : పట్టణ కేంద్రంలో ఆదివారం రజక సంఘం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేరాల చిన్ననరసింహ, గౌరవాధ్యక్షుడిగా చేరాల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా సైదుగాని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చేరాల లింగస్వామి, సహాయ కార్యదర్శిగా రామచర్ల సందయ్య, కోశాధికారిగా గోరుగంటి బాలయ్య, గౌరవ సలహాదారులు ఇబ్రహీంపట్నం రమేశ్, చేరాల బుచ్చయ్య, గోరుగంటి నరసింహ, సభ్యులుగా బండిరాల మల్లయ్య, చేరాల అశోక్, నల్లగంటి చిన్న మల్లేశ్, చేరాల నవీన్, నల్లగంటి ప్రకాశ్, రామచర్ల పాండు, ఇబ్రహీంపట్నం శేఖర్, గోరుగంటి నవీన్ ఎన్నికయ్యారు.

17న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

భూదాన్‌పోచంపల్లి, జూలై 14 : పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో పాండురంగ స్వామి భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు భజన మండలి ప్రతినిధులు చక్రాల నరసింహా, నోముల అశోక్, పుప్పాల నాగేశ్వర్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అనాథాశ్రమంలో వృద్ధుడి ఆత్మహత్య

చౌటుప్పల రూరల్, జూలై14 : మండలంలోని పెద్దకొండూరు గ్రామంలోని సాయి యాదాద్రి సేవాశ్రమంలో ఉంటున్న వృద్ధుడు సింగిరెడ్డి రాంరెడ్డి(80) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాంరెడ్డి 8 నెలల క్రితం ఆశ్రమంలో చేరాడు. 15 రోజుల క్రితం గ్యాస్ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్లాడు. ఈ నెల రెండో తేదీన తిరిగి ఆశ్రమానికి వచ్చాడు. ఆదివారం ఉదయం తన దోవతీతో సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సేవాశ్రమ సూపర్‌వైజర్ పద్మ మృతుడి కుమారుడు సింగిరెడ్డి రవీందర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

శాసన మండలి చైర్మన్ గుత్తాను కలిసిన ఎస్పీ

నల్లగొండ రూరల్,జూలై 14: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్, జూలై 14 : కంటైనర్ లారీని మినీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం వద్ద 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీ లోడుతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్నది. రోడ్డు క్రాస్ చేసే క్రమంలో ఆటో కంటైనర్‌ను వెనుక నుంచి తగిలి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కొడవటిమేట గ్రామపంచాయతీ పరిధిలోని రెక్సిడిగూడెం గ్రామానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు మోదుగు ప్రకాశ్(34) అక్కడిక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మరో శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సీఐ అశోక్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

భువనగిరికలెక్టరేట్, జూలై 14 : భూ వివాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురై మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన బూత్కూరు రవీందర్‌రెడ్డి(45) ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి, అతడి కుటుంబ సభ్యులతో భూ వివాదాలు నడుస్తున్నాయి. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. తాను పురుగుల మందు తాగిన విషయాన్ని ఫోన్ ద్వారా భార్య రమ్యకు తెలిపాడు. దాంతో ఆమె వెంటనే పొలం వద్దకు వెళ్లి స్థానికుల సాయంతో రవీందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భూ పంపిణీ నేపథ్యంలో తమకు రావాల్సిన భూమిని ఇవ్వకుండా అత్త, మరిది బెదిరించడం వల్లే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య రమ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నర్సయ్యగూడెంలో..

వలిగొండ : మండలంలోని నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన ఎడవెల్లి ముత్యాలు ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడవెల్లి ముత్యాలు భార్య సంవత్సరం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దాంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం తన ఇంటివద్ద పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అతడిని చికిత్స కోసం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు 108 సిబ్బంది సాలయ్య తెలిపారు.

డీఎస్సీని 45రోజులు వాయిదా వేయాలి : నాగయ్య

బొడ్రాయిబజార్, జూలై 14 : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీని 45రోజులకు వాయిదా వేసి 25వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ ప్రకటించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరుస పోటీ పరీక్షలు వస్తుండగా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని, గ్రూప్2 పరీక్షలు కూడా వాయిదా వేయాలని పేర్కొన్నారు. 15 రోజులుగా సచివాలయం ఎదుట నిరుద్యోగులు పోటీ పరీక్షలు వాయిదా వేయాలని చేస్తున్న ఆందోళన ప్రభుత్వానికి కనబడుట లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులను మాఫియాతో పోల్చడం అవకాశవాదానికి నిదర్శనమని చెప్పారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రామన్నపేటలో కప్ప కాముడు ఆడుతున్న మహిళలు

ఒక్క సారన్న వచ్చిపోవే వానమ్మ..

- వర్షాలు కురువాలని కప్పకాముడు

వడాయిగూడెంలో కప్పతల్లికి నీరుపోస్తున్న మహిళ

భువనగిరి కలెక్టరేట్, జూలై 14 : వరుణ దేవుడు కరుణించాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ మండలంలోని వడాయిగూడెం గ్రామంలో ప్రజలు ఆదివారం కప్పతల్లికి పూజలు చేశారు. కప్పకు నీరు పోసి ప్రత్యేకపూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి కరువు తొలగిపోవాలని ప్రార్థించారు.

రామన్నపేటలో

రామన్నపేట : వర్షాలు కురువాలని కోరుతూ మండలకేంద్రంలో ఆదివారం మహిళలు కప్పకాముడు ఆట ఆడారు. కప్పకు జలాభిషేకం చేశారు. వర్షాలు బాగా కురువాలని పంటలు బాగా పండాలని కోరుతూ వరుణదేవుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో కందుల హన్మంతు, గాదే రాము, పెద్దబోయిన శంకరయ్య, సుగుణమ్మ, పద్మ, అండాలు, మణేమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ, ప్రేమలత పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిలో బోనాల సందడి

భువనగిరి అర్బన్, జూలై 14: భువనగిరి పట్టణంలోని కుమ్మరివాడ, రైతు బజార్‌లో ఆదివారం పోచమ్మ తల్లి, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివెళ్లి దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్ల, కాంగ్రెస్ నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, సోమయ్య, యాట నాగరాజు, బి.సత్యనారాయణ, తాడూరి భిక్షపతి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

గ్రామాలలో పీర్ల సందడి

ఆత్మకూరు(ఎం), జూలై14 : మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగ సందడి మొదలైంది. పీర్ల చావడిలో పీర్లను కూర్చొబెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు డప్పుచప్పుళ్లతో పీర్లను ఊరేగిస్తూ ఇంటింటికి తిరిగారు. భక్తులు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

నిరుపేద కుటుంబంలో విద్యాకుసుమాలు

- ఒకే ఇంట్లో అక్క, తమ్ముడికి పలు ప్రభుత్వ కొలువులు
- ఒక్కొక్కరికీ ఐదేసి ఉద్యోగాలు

రమేశ్

ఉమా

శాలిగౌరారం, జూలై 14: ప్రస్తుతం ఉన్న పోటీ రంగంలో ఒక్కే ఒక్క ఉద్యోగం కొట్టాలంటే ఎంతో కష్టపడి చదివితే గానీ కొలువు వచ్చే విధంగా లేదు. కానీ శాలిగౌరారం మండలం తిర్మలరాయినిగూడెం గ్రామానికి అక్క, తమ్ముడు ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

తిర్మలరాయినిగూడెం గ్రామానికి చెందిన వాడపల్లి పెద్ద లింగయ్య, పూలమ్మ దంపతులది నిరుపేద కుటుంబం పూలమ్మ రోజు కూలీ, లింగయ్య మత్స్యకార్మికుడు. అయినా కూతురు ఉమా, కుమారుడు రమేశ్‌ను కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. వారు కూడా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి ఒక్కొక్కరు రెండు నుంచి ఐదేసి ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపి కయ్యారు. వీరిద్దరి ప్రాథమిక విద్య గ్రామంలో కొనసాగింది. 6 నుంచి 10 వరకు శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో పూర్తి చేశారు. అనంతరం నకిరేకల్, నల్లగొండ పట్టణాలకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఉమా బీఎడ్, పీజీ 2022లో పూర్తి చేయగా రమేశ్ కూడా బీటెక్ ఎలక్ట్రికల్ 2021లో పూర్తి చేశాడు. అయినా ప్రభుత్వం కొలువు సాధించాలనే తపనతో గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకొని పలు ఉద్యోగాలు సాధించారు. ఉమా 2023 ఆగస్టులో కస్తూర్బాగాంధీ పాఠశాలలో టీచర్ ఉద్యోగం సాధించి విధులు సైతం నిర్వర్తిస్తుంది. అనంతరం విడుదలైన గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్‌కు ఎంపికయ్యారు. జూనియర్ లెక్చరర్‌లో మహిళా కోటాలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు, జనరల్ కోటాలో 11వ ర్యాంకు సాధించినప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉందని ఉమా తెలిపారు. తల్లిదండ్రులతో పాటు తన భర్త బొల్లెపల్లి నాగరాజు ప్రోత్సాహంతోనే ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. రమేశ్ కూడా ఇంటెలిజెన్స్ బ్యూరోలో (జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్)జెఐఓ-2 టెక్నికల్ జనవరి 2024లో ఉద్యోగం సాధించాడు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)ఐ@క్యాడ్ ఎలక్ట్రికల్ ఉద్యోగానికి జూన్ 2024న ఎంపికయ్యాడు. అసిస్టెంట్ ఇంజినీర్ ఏఈఈ@క్యాడ్‌లో స్టేట్ 9వ ర్యాంకు, పాలిటెక్నిక్ లెక్చరర్ స్టేట్ 10వ ర్యాంకు, గ్రూప్-4లో స్టేట్ 108 వ ర్యాంకు సాధించినప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నట్టు రమేశ్ తెలిపారు. వీరిద్దరూ ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

సూర్యాపేట రూరల్, జూలై 14 : మండల పరిధిలోని టేకుమట్ల గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ కొంతకాలంగా కేతేపల్లి మండల ఉప్పల పహాడ్ బస్ స్టాప్ వద్ద గల గుడి వద్ద ఉంటున్నది. ఆదివారం ఉప్పలపహాడ్ నుంచి టేకుమట్ల వైపునకు నడుచుకుంటూ వస్తుండగా అదే మార్గంలో వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ బైక్ వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టింది. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు రూరల్ ఎస్ఐ బాలూనాయక్ తెలిపారు.